క్లుప్తంగా

గోపన్నపాలెంలో 12 మంది వలంటీర్ల రాజీనామా



గోపన్నపాలెం వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ శ్రీలత అందజేస్తున్న దృశ్యం

దెందులూరు: గోపన్నపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో 1, 2 సచివాలయాల్లో సోమవారం వలంటీర్లుగా పనిచేస్తున్న 12 మంది రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచి గెలిపించేందుకు రాజీనామా చేశామని వలంటీర్లు అన్నారు. రాజీనామా పత్రాలను దెందులూరు ఎంపీడీఓ పీ.శ్రీలత, గోపన్నపాలెం గ్రామ కార్యదర్శికి అందజేశారు.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో ఖాజావలి

ఉంగుటూరు: నామినేషన్లు వేసే విధానం, నామినేషన్ల విత్‌డ్రాలు, స్క్రూటినీ తదితర అంశాలపై ఆర్వో ఖాజావలి అవగాహన కల్పించారు. రాజకీయపార్టీల ప్రతినిధులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఖాజావలి మాట్లాడుతూ అభ్యర్థి దర ఖాస్తులో తెలియజేసిన ప్రతిపేజీ నోటరీ చేయించాల్సి ఉందని, నామినేషన్‌దారు భార్య పేరున ఆస్తుల వివరాలు, బ్యాంక్ ఖాతాలను స్పష్టం చేయాలన్నారు. తహసీల్దార్లు వెంకటశివయ్య, వరహాలయ్య, రాంబాబు మాట్లాడారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

భీమడోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సామాజిక సేవా కార్యక్రమాలను చేసినట్లు అల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి, భీమడోలు మండల కమిటీ అధ్యక్షుడు పి.రాజారావు సోమవారం తెలిపారు. భీమడోలు ఆర్జావారిగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పేద వృద్ధ మహిళలకు చీరలను, వృద్ధులకు కండువాలను అందించామన్నారు. ఉమ్మడి రాష్ట్రం హైకోర్టు సీనియర్ న్యాయవాది రోనాల్డ్ రాజ్ సహకారం అందించారని తెలిపారు. ఆంజనేయనగరం వద్ద ప్రయాణికుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు రాజారావు తెలిపారు.

నేడు ప్రత్తికోళ్లలంకలో వైఎస్సార్ సీపీ సమావేశం

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామం ప్రత్తికోళ్లలంకలో వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, జెడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ ముఖ్యఅతిథిలుగా హాజరౌతారని పేర్కొన్నారు. పార్టీ గ్రామాధ్యక్షులు, వడ్డి కార్పొరేషన్ డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలంతా పాల్గొంటారని తెలిపారు.

'అలుపెరుగని పోరాటం' పుస్తకావిష్కరణ

ఏలూరు (టూటౌన్) : ప్రతి తరం ఎమర్జెన్సీని ఎదుర్కొనాల్సిందేనా? అని ప్రశ్నించిన అలుపెరుగని పోరాటం పేరుతో ప్రబీర్ పర్కాయస్త జీవితంపై రచించిన పుస్తకాన్ని సోమవారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ప్రముఖ వైద్యులు రావి గోపాలకృష్ణయ్య ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీవీ నరసింహారావు అధ్యక్షతన సదస్సు నిర్వహించగా, ఆల్ ఇండియా లాయర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ స్వాగతం పలికారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అలుపెరుగని పోరాటం పుస్తకాన్ని పరిచయం చేశారు. బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు, భారత్ బచావో జిల్లా అధ్యక్షులు గుబ్బల నాగేశ్వరరావు, పౌరహక్కుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్ఎస్ కట్టా, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుని వైద్యానికి వితరణ



ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఏలూరు రూరల్ : కిడ్నీ సమస్యతో బాధపడుతోన్న ఏలూరు కొత్తపేటకు చెందిన రాయి గంగాధర్ కుటుంబానికి సోమవారం రూ.20 వేలు సాయం అందించినట్టు రివర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాటూరి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఊరూవాడా జగన్నామస్మరణ



కలపర్రు టోల్‌ప్లాజా వద్ద బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



టోల్‌ప్లాజా వద్ద సీఎం జగన్ ఫ్లెక్సీతో అభిమాని



బస్సు యాత్రలో సీఎం జగన్‌తో దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి



గుండుగొలను సెంటర్‌లో సీఎం జగన్ కోసం అభిమానుల ఎదురుచూపులు



టోల్‌ప్లాజా వద్ద సీఎంను కలిసేందుకు యువత పోటీ



బైక్‌పై ర్యాలీగా వెళుతున్న కొవ్వలి నాయకులు



టోల్‌ప్లాజా వద్ద కార్యకర్తల సందడి



బస్సు యాత్రలో సీఎం జగన్‌తో ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్/దెందులూరు/పెదపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏలూరులో అపూర్వస్వాగతం లభించింది. వైఎస్సార్ సీపీ నేతలు, శ్రేణులు కోలాహలంతో ఏలూరు కలపర్రు టోల్‌ప్లాజా వద్ద జగన్నామస్మరణతో మార్మోగింది. తమ గుండెల్లో దేవుడిగా కొలుస్తోన్న అభిమాన జనసందోహం పోటెత్తగా అందరికీ అభివాదం చేస్తూ సీఎం జగన్ బస్సు యాత్ర కొనసాగింది. ఏలూరు జిల్లాలోకి సీఎం జగన్ బస్సు యాత్ర ప్రవేశించడంతో ఆయనకు వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ పి.మిథున్‌రెడ్డి, ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని, దెందులూరు, ఉంగుటూరు, పోలవరం ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఘన స్వాగతం పలికారు.

టోల్ ప్లాజా ప్రాంతం జనసంద్రం

కలపర్రు టోల్‌ప్లాజా వద్ద సీఎం జగన్‌ను చూసేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు పోటెత్తడంతో ఆ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది. అభిమాన నాయకుడు జగనన్నకు స్వాగతం పలుకుతూ బాణసంచా కాల్చి, గుమ్మడికాయలతో దిష్టి తీసి సిద్ధం బస్సు యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. రాత్రి 7.30 గంటల సమయంలోనూ మహిళలు, చిన్నారులు, వృద్ధులు సీఎం జగన్‌ను చూసేందుకు ఉవ్విళ్లూరారు. యువత బైక్‌లతో ర్యాలీలు చేస్తూ కేరింతలు కొట్టారు. కలపర్రు టోల్‌ప్లాజా ప్రాంతం జై జగన్ నినాదాలతో హోరెత్తిపోయింది. పోలీసులు సైతం అభిమానులను నిలువరించేందుకు శ్రమించాల్సి వచ్చింది. సీఎం జగన్‌ని సమీపంలో నుంచి చూసేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు యువత పోటీపడ్డారు. సీఎం జగన్ ఫొటోలతో కూడిన ప్ల కార్డులు, జెండాలు, ఫ్లెక్సీలతో యువత స్వాగతం పలికారు.

అభివాదం చేస్తూ ముందుకు

సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఏలూరు ఆశ్రం జంక్షన్ వద్ద ప్రజలు సీఎం జగన్‌ను చూసేందుకు బారులుతీరారు. అనంతరం దెందులూరు, కొవ్వలి, సత్యనారాయణపురం ప్రాంతాల్లో రాత్రివేళలోనూ మహిళలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి జాతీయ రహదారిపై నిలబడి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అభివాదం చేశారు. అనంతరం ఉంగుటూరు నియోజకవర్గం గుండుగొలను సెంటరులో భారీగా ప్రజలు చేరుకున్నారు. సీఎం జగన్ బస్సుపైకి వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. ఈ యాత్రలో రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లం గోళ్ల శ్రీలక్ష్మి, వడ్డీల కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం సూర్యనారాయణ, ప్రభాకరరావు, మండలి కొండలరావు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్ గురునాథ్, కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఏలూరు జెడ్పీటీసీ మండలి సరస్వతి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జానంపేట బాబు, అప్పనప్రసాద్, తేరా ఆనంద్, ఎంపీపీలు తాతా రమ్యశ్రీ, బత్తుల రత్నకుమారి, పెన్మెత్స శ్రీనివాసరాజు, బొమ్మనబోయిన సుమలత, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబరు కత్తుల రవికుమార్, మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, పార్టీ జిల్లా కమిటీసభ్యులు పోకల రాంబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, జెట్టిగురునాథం, డీబీఆర్‌కే చౌదరి, ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొవ్వలి నాయకుల స్వాగతం

ఏలూరు రూరల్ : సీఎం జగన్ బస్సు యాత్రకు వైఎస్సార్ సీపీ కొవ్వలి నాయకులు స్వాగతం పలికారు. రాత్రి 9 గంటలకు ఏఎంసీ వైస్‌చైర్మన్ కాటి సుధాకర్ ఆధ్వర్యంలో నాయకులు గొల్ల వీరాస్వామి, గొల్ల నాగరాజు, గొరిపర్తి ఏసురాజు, కొట్టు శ్రీనివాసరావు, ఆకుల పెద్దిరాజు, తమ్మినేని పోల య్య, షేక్ బాషా, డి.సూర్యప్రకాష్ కొవ్వ లి వంతెన నుంచి బైక్‌లపై ర్యాలీగా కలపర్రు టోల్‌గేట్ వద్దకు వెళ్లారు. జగన్‌కు స్వాగతం పలికారు. మరోసారి జగన్‌కే ప్రజలు పట్టం కడతారని సుధాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు



ఎత్తైన ప్రదేశాల్లో ప్రమాదాలను జెడ్ పరికరాలతో అదుపు చేస్తున్న దృశ్యం



అయిల్ ట్యాంకర్ల ప్రమాదాన్ని ఫోమ్ సాయంతో అదుపుచేసే విధానం

భీమడోలు: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణలపై జాతీయ రహదారి భీమడోలు జంక్షన్ వద్ద రెండో రోజు సోమవారం అగ్నిమాపక శాఖ సిబ్బంది నిర్వహించిన అగ్నిమాపక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భీమడోలు అగ్నిమాపక అధికారి జి.నాగరాజు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది ట్రిబుల్ పర్పస్ పరికరాన్ని వినియోగించి మంటలను అదుపులోకి తీసుకురావడం, రసాయనాలు, ఆయిల్ ట్యాంకర్లు, ఫ్యాక్టరీల్లో జరిగే పెను ప్రమాదాలను ఫోమ్‌తో అరికట్టడంపై ప్రదర్శనలు నిర్వహించారు. మంట తక్కువ, పొగ ఎక్కువగా ఉన్న సమయంలో రివాల్వింగ్ పరికరంతో, ఎత్తైన ప్రదేశంలో అగ్ని ప్రమాదాల అదుపు చేసే జెడ్ విన్యాసాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారి జి.నాగరాజు మాట్లాడుతూ అప్రమత్తతతోనే ప్రమాదాలు నివారణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ బస్సు యాత్రకు అపూర్వ స్పందన

- చంద్రబాబు కుట్రలు పరాకాష్టకు చేరాయి
- పవన్‌కల్యాణ్‌కు ఇంగిత జ్ఞానం లేదు
- ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్





పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు అనూహ్య స్పందన రావడంతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హత్య కుట్రలకు తెరతీశారని, చివరకు సీఎం జగన్ ప్రాణాలను కూడా తీసేందుకు ఒడిగట్టారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏలూరు శనివారపుపేట సారథి కల్యాణ మండపంలో సోమవారం ఏలూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని ఇడా చైర్మన్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సీఎం జగన్ పేదల పక్షాన నిలిచారని, ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని చంద్రబాబు కుతంత్రాలు పన్నుతున్నారని ఆరోపించారు. బస్సు యాత్రకు ప్రజలు అశేషంగా హాజరవుతూ సీఎం జగన్‌కు మద్దతు తెలుపుతుండటంతో ఫ్యాన్ గాలికి కొట్టుకుపోతామనే భయంతో చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఫ్యాన్ ప్రభంజనానికి కొట్టుకుపోవడం ఖాయమన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వెకిలి మాటలు, పిచ్చి చేష్టలతో కనీస ఇంగిత జ్ఞానం లేకుండా బుద్ధిహీనంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అమానవీయంగా దుండగులు దాడికి పాల్పడితే కనీస మానవత్వం లేకుండా మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ తన నైజాన్ని చాటుకున్నాడని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలంతా గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఎమ్మెల్యే నాని అన్నారు.

బీసీలకు పెద్దపీట : ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ కనీసం ఒక్క స్థానంలోనైనా గెలిస్తాడో లేదో అనుమానమే అన్నారు. తొలుత 26 సీట్లని, గాయత్రి మంత్రమని సొల్లు కబుర్లు చెప్పిన పవన్‌కళ్యాణ్ ఆఖరికి 21 సీట్లతో సరిపెట్టుకున్నాడని, వాటిలో సైతం 9 మంది టీడీపీ నుంచి వచ్చిన వారే ఉండటం, అతని రాజకీయ పరిజ్ఞానానికి నిదర్శనమన్నారు. సీఎం జగన్ రాష్ట్రంలో బీసీలకు 25 ఎంపీ సీట్లల్లో 11 కేటాయించి బీసీ పక్షపాతిగా నిరూపించుకున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఏలూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ 7 అసెంబ్లీ స్థానాలు, ఏలూరు ఎంపీ స్థానం గెలుచుకుని సీఎం జగన్‌కు బహుమతిగా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. సమావేశంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్, నీతాజైన్, నగర మహిళా అధ్యక్షురాలు నున్నా స్వాతి శ్రీదేవి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం కావాలి



కొవ్వలిలో వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న కామిరెడ్డి నాని

దెందులూరు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా శ్రేణులంతా కృషి చేయాలని పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. సోమవారం రాత్రి కామిరెడ్డి నాని, దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్ అధ్యక్షతన నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఇటీవల పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలను, దీనికి కృషి చేసిన నాయకులను అభినందించారు. కొవ్వలి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, సర్పంచ్ ఇంటేటి మధులత, పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లా వీరాస్వామి, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి, నాయకులు గొరిపర్తి రంగారావు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీఓ నేతలకు సన్మానం

ఏలూరు(మెట్రో) : ఉద్యోగుల క్రమబద్ధీకరణకు విశేష కృషిచేసిన ఏపీ ఎన్‌జీఓ నాయకులకు కాంట్రాక్ట్ ఉద్యోగం నుంచి రెగ్యులర్ అయిన మెడికల్ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఏపీ ఎన్‌జీవోస్ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావును దుశ్శాలువాతో సత్కరించారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ 20 ఏళ్లకు సాకారమైందని, ఏప్రిల్ 1 నుంచి రెగ్యులర్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నామని, దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు.

18 నుంచి సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

- రిటర్నింగ్ అధికారి, జేసీ లావణ్యవేణి



మాట్లాడుతున్న ఆర్వో లావణ్యవేణి

దెందులూరు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 18 నుంచి దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బీ.లావణ్యవేణి అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ, 29 మధ్యాహ్నం 3 గంటలకు పోటీలో ఉన్న ఫైనల్ అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. మే 13న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే నామినేషన్‌కు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రం సమర్పించి రూ.5 వేలు డిపాజిట్ చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఫారం-26, బ్యాంకు అకౌంట్ పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, ఐటీ రిటర్న్స్, విద్యార్హత, నేరచరిత్ర వివరాలు, డిక్లరేషన్ పత్రాలను నామినేషన్‌తో జత చేయాలన్నారు. 25 ఏళ్ల వయస్సు ఉన్న వారందరూ పోటీకి అర్హులని తెలిపారు. ఒక్కొక్క అభ్యర్థి 4 సెట్లు నామినేషన్ పత్రాలు సమర్పించాలన్నారు.

దెందులూరు నియోజకవర్గంలో 2,22,772 ఓటర్లు

ఆర్వో మాట్లాడుతూ పలు అంశాలు వివరించారు. దెందులూరు నియోజకవర్గంలో 2,22,772 ఓటర్లు ఉన్నారు. ఇటీవల ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు 7,050 మంది ఓటు హక్కును పొందారు. నియోజకవర్గంలో 239 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. 574 ఈవీఎం మిషన్లు, 622 వీవీ ప్యాడ్స్ సిద్ధంగా ఉన్నాయి. భారత ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా అన్ని పోలింగ్ స్టేషన్లల్లో వెళ్లడానికి దారి, విద్యుత్, తాగునీరు, రహదారి, శ్లాబు, బెంచీలతో పాటు అన్ని సౌకర్యాలున్నాయి. ఇప్పటికే అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు అన్ని పోలింగ్ స్టేషన్లల్లో తనిఖీ చేశారు. నూతనంగా వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపై ఉన్న వారికి భారత ఎన్నికల సంఘం హోం ఓటింగ్ సౌకర్యం కల్పించిందన్నారు. బీఎల్‌ఓలు ఇళ్లకు వెళ్లి వారి అనారోగ్యం, వారి పరిస్థితిని నిర్ధారించి వారికి పోస్టల్ బ్యాలెట్‌ను, ఓటింగ్ సిబ్బంది ద్వారా కల్పిస్తారు. 80 ఏళ్ల పైబడిన వారు 2466 మంది ఉన్నారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదు. కుల, మత, వర్గ, ప్రాంత ప్రస్తావన తీసుకురాకూడదు. ఎదుటవారి వ్యక్తిగత విషయాలు ప్రచారంలో ప్రస్తావించకూడదు. ర్యాలీలు, సభలు, సమావేశాలు, వాహనాలు, మైకుల అనుమతి ముందుగానే రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి పొందాల్సి ఉంది. ఏ రాజకీయ పార్టీ అయినా నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. నామినేషన్ల రోజున ఆర్వో కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఉండాలన్నారు. ఒక అభ్యర్థి, నలుగురు వ్యక్తులు మాత్రమే లోపలికి అనుమతి ఇస్తారని అన్నారు. నియోజకవర్గంలో ఎస్ఎస్‌టీ -4 స్క్వాడ్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 6 స్క్వాడ్‌లు, 24 గంటలూ విధులు నిర్వహిస్తున్నారని రిటర్నింగ్ ఆఫీసర్ లావణ్యవేణి అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీ జితేంద్ర, పెదవేగి తహసీల్దార్ ఉన్నారు.